ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
ఆదివారం 14 జనవరి 2024




సంక్రాంతి శోభ

- నేడు భోగితో.. పండుగ సంబురాలు ప్రారంభం
- పల్లెల్లో భోగిమంటలకు ఏర్పాట్లు
- ఇంటింటా పిండివంటలు.. సకినాలు స్పెషల్
- ముగ్గులకు రంగులు.. పతంగుల కొనుగోళ్లు
- హరిదాసుల కోలాహలం
- సందడిగా మారిన పల్లెలు, పట్టణాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 13 : జిల్లా ప్రజలు సిరుల సంక్రాంతి పండుగకు సిద్ధమయ్యారు. రైతులు పండించే ధాన్యం ఇంటికి వచ్చేవేళ జరుపుకునేదే సంక్రాంతి.. ఈ పండుగను రైతు కుటుంబాలు ఆనందోత్సాహంగా జరుపుకుంటాయి. నేడు (ఆదివారం) 14న భోగి, 15న మకర సంక్రాంతి, 16న కనుమ పండుగ జరుపుకునేందుకు ప్రజలంతా తయారు అయ్యారు. సుదూర ప్రాంతాల్లోని పట్టణాల్లో వ్యాపారం, ఉద్యోగరీత్యా స్థిరపడిన ఉద్యోగులు, వ్యాపారులు తమ సొంతూళ్లకు చేరుకున్నారు. బంధువులు, చిన్నపిల్లల రాకతో గ్రామాల్లో సంక్రాంతి శోభ సంతరించుకుంది. ఈనెల 12 నుంచి విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు వారివారి గ్రామాలకు ఇప్పటికే చేరుకున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారంతా పండుగ కోసం పల్లెలకు చేరుకోవటంతో గ్రామాలన్నీ సందడిగా మారాయి.

ఆంధ్రాలో కోడి పందాలకు ఎంత ప్రాముఖ్యత ఉందో.. తెలంగాణలో సంక్రాంతి పండుగకు సకినాలకు అంతటి ప్రాముఖ్యత ఉంటుంది. ప్రతీ ఒక్కరు పిండి వంటలు చేయడంలో తలమునకలయ్యారు. సంక్రాంతి పర్వదినం రోజున ఉదయాన్నే లేచి, తమ వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వేసి, ఆవుపేడతో తయారుచేసిన గొబ్బెమ్మలను పెట్టి వాటిపై నవధాన్యాలు, గడ్డిపూలు, రేగుపండ్లు పోస్తారు. బోగి మంటలు పెటుకుని వాడలోని ప్రజలు, బంధువులు ఒకచోట చేరి కోలాహలంగా గడుపుతారు. ఉదయాన్నే లేచి స్నానాలు ఆచరించి, దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పల్లెల్లో వ్యవసాయానికి ఉపయోగించే పశువులను శుభ్రంగా కడిగి బంతిపూలు కట్టి పూజిస్తారు. తమ ఇళ్ల ప్రధాన ద్వారాలకు బంతిపూలు కట్టి అందంగా అలంకరించుకుంటారు. గ్రామాల్లో గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల వేషధారణలు అలరించనున్నాయి.

ఇక గ్రామాల్లో, పట్టణాల్లో చిన్నారులు మొదలుకుని యువకులు గాలిపటాలు ఎగిరేస్తూ కోలాహలంగా గడపనున్నారు. విద్యాసంస్థల్లో ఇప్పటికే ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. రంగురంగుల ముగ్గులు వేయడంతో పాటు పతంగులను ఎగురవేసి, సంక్రాంతి పండుగ ప్రాధాన్యతను వివరించారు. రాష్ట్రంలో సంక్రాంతి పండుగ అంటే స్పెషల్ సకినాలు.. ఈ పండుగకు వారం రోజుల ముందు నుంచే ప్రతీ ఇంట్లో పిండివంటలను తయారు చేస్తున్నారు. అందులో ప్రధానంగా అరిసెలతో పాటు సకినాలు ప్రత్యేకంగా తయారు చేస్తారు.


పతంగులు ఎగురవేస్తూ కేరింతలు కొడుతున్న చిన్నారులు

రేపు మకర సంక్రాంతి..

సోమవారం రెండోరోజు సంక్రాంతి పాలుపొంగించి, దానితో మిఠాయిలు తయారు చేస్తారు. దాదాపుగా అందరి ఇళ్లలో అరిసెలు, బొబ్బట్లు, జంతికలు, చక్కినాలు (సకినాలు), సేమియాపాయసం, పరమాన్నం, పులిహోర, గారెలు మొదలగు పిండివంటకాలు చేసి, ఈ పండుగను జరుపుకుంటారు. ఈ రోజున పితృదేవతలకు తర్పణాలు వదులుతారు. మిగిలిన పదకొండు సంక్రమణాలకు ఇవ్వకపోయినా ఈ మకర సంక్రమణానికి మాత్రం తప్పకుండా పితృతర్పణాలు ఇస్తారు. సంక్రాంతి రోజుల్లో ప్రతీ ఒక్కరిని ముగ్గులను చేసే దృశ్యాలే గంగిరెద్దుల ఆటలు, ఇళ్లిళ్లు తిరుగుతూ డోలు, సన్నాయిరాగాలతో గంగిరెద్దులతో చేయించే నృత్యాలు కనువిందు చేస్తాయి. ఆ గంగిరెద్దులకు గృహస్తులు ఇచ్చే కానుకలు స్వీకరిస్తూ తలలుఊపుతు ధన్యవాదాలు తెలుపుతున్న గంగిరెద్దుల విన్యాసాలు అందరిని ఆకట్టుకుంటాయి. కొత్తధాన్యం వచ్చిన సంతోషంలో అనేక మంది హరిలో..రంగాహరి అంటూ ఇంటికి వచ్చే హరిదాసులకు ధాన్యాన్ని ధానం రూపేణ ఇస్తారు.

భోగిమంటలు, బొమ్మల కొలువులు..

ఉత్తరాయణ పుణ్యకాలం సంక్రాంతి రోజున ఏ దానమైన శ్రేష్ఠమైందని పురాణాల్లో పేర్కొన్నారు. ధాన్యం, ఫలాలు, విసనకర్ర, వస్త్రాలు, కాయగూరలు, దుంపలు, నువ్వులు, చెరుకు లాంటివి దానాలు చేస్తారు. ఈ కాలంలో చేసే గోదానం వల్ల స్వర్గవాసం కలుగుతుందని పూర్వీకులు విశ్వసిస్తారు. ఈ నెల 14న తెల్లవారకముందే లేచి భోగిమంటలు వేసుకుంటారు. ఇప్పటికే పల్లెలు, పట్టణాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. చలిని పారద్రోలడానికేకాకుండా ఇంట్లో ఉండే పాతచీపుర్లు, తట్టలు, విరిగిపోయిన బల్లలు ఇతరత్రా వాటిని వదిలేసి కొత్తవాటితో నిత్యనూతన జీవితం ఆరంభించడానికి గుర్తుగా భోగి మంటలు వేస్తారని చెబుతారు. సాయంత్రం పూట ఇళ్లలో కొంతమంది స్త్రీలు, చిన్నపిల్లలు, బొమ్మల కొలువులు ఏర్పాటు చేస్తారు. ఇందులో అనేక రకాల ఆటవస్తువులు ప్రదర్శనగా ఉంచి, ఆనందిస్తారు. ఇంకొంతమంది బోగిపండ్లు, శెనిగలు, పలు, చెరుకు గడలు, కొన్ని నాణెలు, కొత్తదుస్తులు ధరించిన పిల్లలను ఆశీర్వదిస్తారు. చిన్నారులకు బోగిపండ్లు (రేగుపండ్లు) పోస్తారు. మరోపక్క ఇండ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి, పేడతో తయారు చేసిన గొబ్బెమ్మలను పెట్టి, వాటిపై నవధాన్యాలు పోస్తారు.

ప్రజలకు కలెక్టర్ శుభాకాంక్షలు..

మహబూబాబాద్ టౌన్ : జిల్లా ప్రజలకు కలెక్టర్ అద్వైత్‌కు మార్‌సింగ్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రైతులు పండించే ధాన్యం ఇంటికి వచ్చే శుభవేళ జరుపుకునే పండుగ సంక్రాంతి అని వివరించారు. భారతదేశం వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడం గొప్ప అదృష్టమన్నారు. రైతాంగ కుటుంబాలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు.

మూడోరోజు కనుమ ...

వ్యవసాయంలో తమకు ఎంతో చేదోడువాదోడుగా ఉంటున్న పశువులకు శుభాకాంక్షలు తెలుపడానికి కనుమ నిర్వహించుకుంటారు. వ్యవసాయానికి ఉపయోగించే పశువులను శుభ్రం చేసి, వాటికి బంతిపూలు కట్టి పూజలు చేస్తారు. అంతేకాదు.. వనభోజనాలు కూడా ఈ రోజే నిర్వహిస్తారు. కనుమనాడు 'మినుము' తినాలనేది సామెత. దీనికి అనుగుణంగా గారెలు, వడలు చేసుకోవడం ఆనవాయితి. శాఖాహారులు మినుములో మాంసకృత్తులు ఎక్కువగా ఉండటాన్ని పరిగణలోకి తీసుకొని మినుము గారెలతో సంతృప్తి పడుతారు. కనుమరోజు ప్రయాణం చేయకపోవడం సంప్రదాయం. మూడురోజుల సంక్రాంతి పర్వదినం జరుపుకునేందుకు సర్వం సిద్ధమయ్యారు.

వెరైటీ పతంగులు..

మానుకోట జిల్లా కేంద్రంలోని సంక్రాంతి పర్వదినం

మిగతా 8వ పేజీలో..


వనదేవతల గద్దెలను దర్శించుకుంటున్న భక్తులు

భక్తులతో సందడిగా మారిన మేడారం

- వనదేవతలకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు

మేడారం, జనవరి 13 : తాడ్వాయి మండలంలోని మేడారం వనదేవతలు సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు శనివారం అధికంగా తరలివచ్చారు. వచ్చే ఫిబ్రవరి 21వ తేదీ నుంచి 4రోజుల పాటు ఆదివాసీ వనదేవతల మహా జాతర ఘనంగా జరగనుంది. ఈ నేపథ్యంలో వివిధ దూర ప్రాంతాలకు చెందిన భక్తులు కుటుంబ సమేతంగా మేడారం చేరుకొని, తల్లుల గద్దెలకు ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను దర్శించుకున్నారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, సారె, కొబ్బరికాయలు, బెల్లం (బంగారం) సమర్పించుకుని పూజలు చేశారు. చల్లగా చూడాలని మొక్కుకున్నారు. 20 వేలకు పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని మేడారం ఎగ్జిక్యూటివ్ అధికారి రాజేంద్రం తెలిపారు.

జన సంచార ప్రాంతాల్లో ట్రైనీ ఎస్పీ సందర్శన

మహబూబాబాద్ రూరల్, జనవరి 13 : జిల్లా కేంద్రంలోని జన సంచార ప్రాంతాలు రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాలను శనివారం ట్రైనీ ఎస్పీ చేతన్‌పరేష్ పరిశీలించారు. శిక్షణలో భాగంగా మహబూబాబాద్‌కు వచ్చిన ట్రైనీ ఎస్పీ చేతన్‌పరేష్ రైల్వేస్టేషన్, బస్టాండ్‌తో పాటు టౌన్ పోలీస్‌స్టేషన్ కూడ్ని సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి, వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి టౌన్ సీఐ రమేష్‌నాయక్, టౌన్ ఎస్సై రామారావు, రూరల్ ఏఎస్సై రమేష్ పాల్గొన్నారు.


బస్టాండ్ ప్రాంతాలను పరిశీలిస్తున్న చేతన్‌పరేష్

మచ్చర్లలో మల్లికార్జున స్వామి జాతర ప్రారంభం

గూడూరు, జనవరి 13 : మండలంలోని మచ్చర్లలో శనివారం రాత్రి మల్లికార్జున స్వామి జాతర ప్రారంభమైంది. తొలిఘట్టంగా గ్రామంలోని గ్రామదేవతకు బిందెలతో జలాభిషేకం నిర్వహించారు. ఆపై శోభయాత్ర నిర్వహించి ఊరేగింపుగా మచ్చర్ల శివారు అటవీప్రాంతంలోని మల్లికార్జునస్వామి కొలువు దీరిన గుట్టకు చేరుకున్నారు. అక్కడ మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు కన్నుల పండువగా మరోమూడ్రోజుల పాటు జరుగనున్నాయి. ఆదివారం బోగీ సందర్భంగా మహాగణపతిపూజ, పునర్వచనం, అంకురార్పణం, రుద్రాభిషేకం, హోమం, తీర్థప్రసాదములు, అనంతరం ఒగ్గు కథతో కాలక్షేపం, ఫైలలు తీసే కార్యక్రమం చేపట్టనున్నారు. కార్యక్రమంలో పెద్దగొల్ల కాడబోయిన నర్సయ్య, సార గొల్ల అవుల రాములు, గజ్జి వెంకటేష్, మల్లయ్య, యాకయ్య, వెంకన్న, ఉప్పలయ్య పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా రాజేందర్



ఇనుగుర్తి, జనవరి 13 : ఢిల్లీలో ఈనెల 16వ తేదీ నుంచి 21 వరకు జరిగే యోనెక్స్ సన్‌రైజ్ ఇండియా వరల్డ్ టూర్ ఆధ్వర్యంలో నిర్వహించే అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు ఇనుగుర్తి మండలం కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కొమ్ము రాజేందర్ ఎంపికైనట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌కుమార్, రమేష్‌రెడ్డి శనివారం తెలిపారు. గతంలో రాజేందర్ రెండు పర్యాయాలు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అంపైర్‌గా పాల్గొన్నారని చెప్పారు. ఈ సందర్భంగా అసోసియేషన్ బాధ్యులు నాగ కిషన్, మోహన్‌రావు, శ్యాంకుమార్, కిశోర్‌లు రాజేందర్‌ను అభినందించారు.

'ఎస్సారెస్పీ నీటిని పొదుపుగా వాడుకోవాలి'

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 13 : ఎస్సారెస్పీ స్టేజీ-1 డీబీఎం-48 కాల్వల ద్వారా స్టేజీ-2 డీబీఎం-60 కాల్వల ద్వారా జిల్లా పరిధిలోని ఆయకట్టుకు నీటి విడుదల చేస్తున్నామని, ఆ నీరును వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని నీటిపారుదల శాఖ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ కె.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాంసాగర్, లోయర్‌మానేర్ డ్యామ్‌లో ఇతర రిజర్వాయర్లలో తగినంత నీరు లభ్యతగా లేకపోవడంతో చివరి ఆయకట్టు వరకు నీటిని అందించలేమని వెల్లడించారు. రైతులు బావులు, బోరు వ్యవసాయం ఉన్నవారు మాత్రమే కాల్వ నీటిపై ఆధారపడకుండా ఆరుతడి పంటలు వేసుకోవాలని ఆయన కోరారు.

రైలులోంచి పడి గుర్తుతెలియని వ్యక్తికి గాయాలు

కేసముద్రం, జనవరి 13 : మండలంలోని ఇంటికన్నె రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం తెల్లవారుజామున డౌన్ వైపునకు వేగంగా వెళుతున్న సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలులోంచి గుర్తుతెలియని వ్యక్తి పడడంతో తీవ్రంగా గాయాలైనట్లు 108 సిబ్బంది తెలిపారు. రైల్వే సిబ్బంది ఇచ్చిన సమాచారంతో సదరు వ్యక్తిని 108లో మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే ఆ వ్యక్తికి స్పృహలేకపోవడం, అతడి వద్ద ఎలాంటి ఆధారాలు, ఫోన్ లేకపోవడంతో గాయపడిన వ్యక్తి వివరాలు తెలియరాలేదు. జిల్లా ఆస్పత్రిలోని ఐసీయూ విభాగంలో చికిత్సనందిస్తున్నారు.

'దీప్తి మృతిపై సీబీసీఐడీతో విచారణ జరిపించాలి'

- మానుకోటలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా


నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

నెహ్రూసెంటర్, జనవరి 13 : గిరిజన యువతి రాథోడ్ దీప్తి ఆత్మహత్యపై సీబీసీఐడీచే సమగ్ర విచారణ జరిపించాలని గిరిజన సామాజిక చైతన్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కిషన్‌నాయక్ మాట్లాడుతూ హనుమకొండలోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ ద్వితీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్న దీప్తి ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించి, అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రోజురోజుకు దళిత, గిరిజన యువతులు, మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే బాధ్యులను శిక్షించి దీప్తి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. కుర్ర మహేష్, మాదరబోయిన యాకయ్య, కొప్పుల రమేష్, జైపాల్, బెజ్జం ఐలేష్, రఘువీర్‌రాథోడ్, బానోత్ మోతీలాల్ నాయక్, భూక్య శ్రీను, బానోత్ బీంజీ, భూక్య కీమ్యానాయక్, వెంగళ్‌నాయక్, మంగీలాల్ నాయక్, ఎలకట్టి సైదులు, షేక్‌జానిమియా, సురుగు నర్సయ్య పాల్గొన్నారు.

'వ్యాధి నిరోధక టీకాలు వేయాలి'

నెహ్రూసెంటర్, జనవరి 13 : జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులందరికి వ్యాధినిరోధక టీకాలు వేసేలా చర్యలు తీసుకోవాలని సబ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణార్జున్‌రావుసూచించారు. జిల్లాలోని అద్దాలతండా, గుమ్ముడూరు యూపీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లను శనివారం సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుడే పుట్టినబిడ్డ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు అందరికీ వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చి ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వడ్డెబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

డోర్నకల్‌లో మరిన్ని రైళ్లకు హాల్టింగ్

డోర్నకల్, జనవరి 13 : డోర్నకల్ రైల్వే జంక్షన్‌లో త్వరలో మరికొన్ని సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించనున్నట్లు దక్షిణమధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్ మేనేజర్ (పీసీవోఎం) నాగ్యా తెలిపారు. డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో శనివారం ఆయన పర్యటించారు. ప్రత్యేక రైలులో వచ్చినపీసీవోఎం స్టేషన్‌లోని 4వ నెంబర్ ప్లాట్‌ఫాం నుంచి కాలినడక వచ్చి బ్రిడ్జిపై నుంచి యార్డులును పరిశీలించారు. డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు షైనూపాష, ఖాదర్‌లు ఆయనకు పలు రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని, కొవిడ్‌కు పూర్వం ఉన్న ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా పీసీవోఎం మాట్లాడుతూ డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో న్యూ ఢిల్లీ, చెన్నై, ముంబై వెళ్లేందుకు వీలుగా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ప్రస్తుతం మూడోలైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, అవి పూర్తికాగానే నాలుగో లైన్ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. డోర్నకల్ ఎస్ఎస్ శోభన్‌ప్రసాద్, సీఎస్‌డబ్ల్యూ బాబు పాల్గొన్నారు.

నేటి నుంచి పుష్‌పుల్ రైలు ప్రారంభం..

కాజీపేట-డోర్నకల్, డోర్నకల్- విజయవాడ, విజయవాడ-డోర్నకల్, డోర్నకల్-కాజీపేట మధ్య నడిచే పుష్‌పుల్ ప్యాసింజర్ ఆదివారం నుంచి పునరుద్ధరించనున్నట్లు రైల్వేశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. డోర్నకల్‌కు వచ్చిన పీసీవోఎం నాగ్యా దృష్టికి ప్యాసింజర్ రైళ్ల రద్దు వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ డీఆర్‌యూసీసీ సభ్యులు తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన పీసీవోఎం ఆదివారం నుంచి పుష్‌పుల్ ప్యాసింజర్‌ను పునరుద్ధరిస్తున్నట్లు వివరించారు.


వినతిపత్రం ఇస్తున్న మాజీ డీఆర్‌యూసీసీ సభ్యులు

తగ్గిన రాబడి

- జిల్లాలో పడిపోయిన రిజిస్ట్రేషన్ల సంఖ్య
- ప్లాట్ల క్రయవిక్రయాలూ తగ్గుముఖం
- 2023లో డాక్యుమెంట్లు 15643.. ఆదాయం రూ. 23.31 కోట్లు
- రిజిస్ట్రేషన్ల చరిత్రలో తగ్గడం ఇదే ప్రథమం

మహబూబాబాద్ టౌన్, జనవరి 13 : దినదినాభివృద్ధి చెంది, జిల్లాగా ఆవిష్కృతమైన మహబూబాబాద్‌లో 2023 సంవత్సరంలో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు భారీగా తగ్గిపోయాయి. గత ఏడాది 2022తో పోల్చుకుంటే స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖకు ఈ ఏడాది కోట్లలో పెరగాల్సింది పోయి.. గత సంవత్సరం కంటే రూ.35 లక్షలు కోల్పోయింది. జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ చరిత్రలో తగ్గడం ఇదే ప్రప్రథమం. ప్రతీ సంవత్సరం రిజిస్ట్రేషన్లు పెరుగుతుంటే గత 2023లో అందుకు భిన్నంగా తగ్గుముఖం పట్టాయి. 2022 సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 18 మండలాలు, నాలుగు మునిసిపాలిటీలు మానుకోట, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్‌ల పరిధిలో ఇంటి స్థలాలకు సంబంధించి 16,546 రిజిస్ట్రేషన్లు జరగగా తద్వారా ఏడాది (జనవరి నుంచి డిసెంబరు మాసం వరకు)లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వార రాష్ట్రప్రభుత్వానికి రూ.23.66 కోట్ల ఆదాయం సమకూరింది. 2023లో 15,643 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు కాగా, తద్వారా 23.31 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది. అంటే 2022 కంటే 2023 సంవత్సరంలో 903 డాక్యుమెంట్లు తగ్గడంతో తద్వారా రూ.35 లక్షల ఆదాయం కూడా తగ్గిపోయింది. ఏటా ప్లాట్ల క్రయ విక్రయాల ద్వారా అదనంగా రూ.కోట్లలో పెరగాల్సిన ఆదాయం తగ్గుముఖం పట్టింది.

ఏటేటా పెరుగుతూ వస్తున్న..

మానుకోట జిల్లా కేంద్రానికి నలుదిక్కుల నాలుగు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఆరుగ్రామాలు ఈదూలపూసపల్లి, శనిగపురం, అనంతారం, జమాండ్లపల్లి, బేతోలు, రజాలిపేట మానుకోట మునిసిపాలిటీల్లో విలీనం చేయడంతో పట్టణంతో పాటు ఆయా విలీన గ్రామాల్లో భూముల ధరలు పెరిగి ఇంటి స్థలాల (ప్లాట్)ల కొనుగోళ్లు జోరందుకున్నాయి. జిల్లా కేంద్రంలో గ్రామీణ ప్రాంత వాసులు ప్లాట్ల కొనుగోలుకు ఆసక్తి చూపడంతో 2016 సంవత్సరం జిల్లా ఆవిష్కృతం నుంచి ఏటా రిజిస్ట్రేషన్లు పెరుగుతూ వస్తున్నాయి. మరోపక్క 2021 సెప్టెంబరు మాసంలో స్టాంపుడ్యూటీ 6.5 నుంచి 7.5 శాతం పెరగడం, 2022 ఫిబ్రవరి మాసంలో రాష్ట్రప్రభుత్వం భూమి ధర (ల్యాండ్ వాల్యూ)ను దాదాపు 40 శాతంకు పెంచడంతో ప్లాట్ల రిజిస్ట్రేషన్ల ద్వారావచ్చే ఆదాయం ఏటా పెరిగింది. దీనికి తోడు నూతనంగా ఏర్పడ్డ మునిసిపాలిటీలు తొర్రూరు, మరిపెడ, డోర్నకల్‌లో పెరిగిన జనాభాకనుగుణంగా గృహనిర్మాణాల కోసం ప్లాట్లను విక్రయిస్తున్నారు. అంతే కాకుండా జిల్లా కేంద్రంలో ఉద్యోగులు సైతం పెరగడంతో ఇక్కడ స్థిరపడాలనుకునే వారు సైతం పట్టణంలో ప్లాట్లను కొనుగోలు చేయడంతో రిజిస్ట్రేషన్లు బాగా పెరిగి ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతూ వస్తోంది.

2023 ఎన్నికల ఎఫెక్టుతో తగ్గుముఖం..

2023 ఎన్నికల సంవత్సరంలో మహబూబాబాద్ జిల్లాలో ప్లాట్ల కొనుగోళ్లు భారీగా పడిపోవడంతో రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడింది. 2023 సంవత్సరం ఆరంభం నుంచే శాసన ఎన్నికల వాతావరణం రావడంతో ఆ ప్రభావం రియల్ ఎస్టేట్ వ్యాపారంపై పడింది. పూర్వ సర్కార్ ఆరునెలల ముందే ఎన్నికలకు పోతుందని ప్రచారం జరగడం.. ఆ తర్వాత ఎన్నికల వేడి రాజుకోవడం తదితర అంశాలతో పాటు మళ్లీ రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వస్తుందో ఆ ప్రభుత్వ ప్రభావం రియల్‌ఎస్టేట్ వ్యాపారంపై ఎలా ఉంటుందోనన్న భయంతో కాబోలు రియల్ ఎస్టేట్ వ్యాపారం పూర్తిగా నిలిచిపోయింది. 2023 చివరాంకంలో ప్లాట్ల క్రయవిక్రయాలు పూర్తిగా స్తంభించి పోయాయి. మరోపక్క రియల్టర్లల్లో రాజకీయ పార్టీల నేతలే ఎక్కువగా ఉండడంతో ఆ వ్యాపారానికి కాస్త విరామం ఇచ్చి, రాజకీయాల వైపు దృష్టి సారించడంతో కూడా ప్లాట్ల విక్రయాలకు బ్రేక్ పడింది. మొత్తానికి అసెంబ్లీ ఎన్నికలు జరిగిన సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా ప్లాట్లవిక్రయాలు తగ్గడంతో రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం తగ్గిపోయింది. దీనికి తోడు జిల్లా కేంద్రంలో పెరగాల్సిన ధరల కంటే ఎక్కువగా ఉండడం కూడ ఒక కారణమని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

నిరుపేదలు, మధ్య తరగతి ప్రజల కొనుగోలు శక్తికి మించి ప్లాట్ల ధరలు పెరగడంతో కొద్ది శాతం ప్రజలు మాత్రమే భూములు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్లాట్ల కొనుగోలు తక్కువ కావడంతో ఆ ప్రభావం రిజిస్ట్రేషన్ శాఖపై పడి ఆదాయం తగ్గుతోంది. ఏది ఏమైనా మహబూబాబాద్ జిల్లాలో ప్లాట్ల రిజిస్ట్రేషన్ల ద్వారా ఏటా వచ్చే ఆదాయం కంటే 2023 సంవత్సరంలో తక్కువగా వచ్చింది. గత ఏడాది కంటే రూ.కోట్లతో అదనంగా పెరగాల్సి ఉండగా పూర్వపు ఏడాది 2022 కంటే తక్కువగా రావడం గమనార్హం.



మహబూబాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం




సంఘటనా స్థలిలో వంశీ, పవన్ మృతదేహాలు

భవనానికి రంగులు వేయడానికి వచ్చి..

- బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పి చెట్టుకు ఢీ
- అక్కడికక్కడే ఇద్దరి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



పత్తిపాకలో సుధాకర్ ఇంటి ఎదుట మృతదేహాలతో బంధువుల ఆందోళన

తాడ్వాయి/శాయంపేట, జనవరి 13: జనవరి 13: పీఏసీఎస్ నూతన భవనానికి రంగులు వేయడానికి వచ్చిన వారిలో ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఇందులో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని నాంపల్లి బంజర గ్రామ శివారులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే...

హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన పోతుగంటి వెంకటేశ్వర్లు-వనితల కుమారుడు వంశీ(23), ఎల్త్రారి మొగిలి-జయలక్ష్మిల కుమారుడు పవన్(22), మామిడి కుమారస్వామి - అన్నపూర్ణల కుమారుడు భాస్కర్(30)లు తాడ్వాయి మండల కేంద్రంలోని పీఏసీఎస్ నూతన భవనానికి రంగులు వేయడానికి వచ్చి పనులు చేపడుతున్నారు. అక్కడ పని ముగిశాక కాటాపూర్‌లోని పీఏసీఎస్ గిడ్డంగి భవనానికి కూడా రంగులు వేసి శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై తిరిగి తాడ్వాయికి వస్తున్నారు. ఈ క్రమంలో నాంపల్లి బంజర మూలమలుపు వద్దకు చేరుకోగానే వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొంది. దీంతో వంశీ, పవన్‌లు రోడ్డుకు పది మీటర్ల దూరంలో ఎగిరిపడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. మామిడి భాస్కర్‌కు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. శనివారం ఉదయం కాటాపూర్ వెళ్లే వాహనదారులు వారిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృతుల కుటుంబాలకు సమాచారం అందించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ములుగు ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా, మృతుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వివరించారు. కాగా, వీరందరూ అవివాహితులని తెలిపారు.

పత్తిపాకలో ఉద్రిక్తత

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుల కుటుంబాలకు న్యాయం చేయాలని బంధువులు, మద్దతుదారులు మృతదేహాలతో ఆందోళనకు దిగారు. శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన పోతుగంటి సుధాకర్.. వెల్త్రారి పవన్(22), పోతుగంటి వంశీ(23), మామిడి భాస్కర్‌లను ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని పీఏసీఎస్ భవనాలకు రంగులు వేయించడానికి తీసుకెళ్లారని, దీనికి యువకుల మృతికి పోతుగంటి సుధాకర్ బాధ్యత వహించి మృతుల కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని శనివారం మృతదేహాలను సుధాకర్ ఇంటి వద్ద వేసి ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మూడుగంటల ఉద్రిక్తతల నడుమ సీఐ మల్లేష్‌తోపాటు శాయంపేట, ఆత్మకూరు, దామెర, పరకాల ఎస్సైలు మృతుల బంధువులను సముదాయించారు. సుధాకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మృతదేహాలను తీసుకుని వెళ్లారు. అనంతరం మృతదేహాల వాహనాన్ని గ్రామంలోని ప్రధానరోడ్డుపై నిలిపి సుధాకర్‌ను తీసుకొచ్చేవరకు మృతదేహాలను తీసుకెళ్లేది లేదని రోడ్డుపై ఆందోళనకు దిగారు. దీంతో మళ్లీ పోలీసులు ప్రవేశించి కుటుంబ సభ్యులు, బంధువులు, మద్దతుదారులకు సర్ది చెప్పి మృతదేహాలను తరలించారు. మృతి చెందిన యువకులను పనికి తీసుకెళ్లిన సుధాకర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

భార్య ఆత్మహత్య..? భర్త హత్య..?

- అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి
- ఆమె బంధువుల దాడి.. చనిపోయిన భర్త
- అచ్చంపేటలో దారుణం.. ఇరు కుటుంబాల్లో విషాదం



సింధు, నాగార్జున (ఫైల్)

అచ్చంపేట, జనవరి 13 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత చనిపోయింది. కుటుంబ కలహాలు, వరకట్న, లైంగిక వేధింపుల ఆరోపణలు ఆమె మరణం చుట్టూ అలుముకున్నాయి. కట్టుకున్నోడి వల్లనే తమ బిడ్డ చనిపోయిందని ఆగ్రహించిన యువతి బంధువులు ఆమె భర్తపై దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు కానీ.. అతడు చనిపోయాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నిండింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సింధు(26)కు పట్టణంలోని శ్రీరాం(సరిరాం) ఆస్పత్రిలో పని చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన నాగార్జునతో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. మూడేళ్ల క్రితం వీరు హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం అక్కడే ఉండి తర్వాత అచ్చంపేటకు వచ్చి శ్రీరాం ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఏడాది క్రితం దంపతుల మధ్య గొడవలు జరగడంతో సింధు.. బిజినేపల్లిలోని అమ్మమ్మ గారి ఇంటికి వెళ్లిపోయింది. నాగార్జున పోలీసులను ఆశ్రయించడంతో ఆమె తిరిగి వచ్చింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, డబ్బు కోసం భర్త వేధింపుల నేపథ్యంలో ఇరువురి మధ్య మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సింధు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కొన ఊపిరితో ఉన్న ఆమెకు భర్త నాగార్జున.. శ్రీరాం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా సింధు చనిపోయింది. ఈ విషయాన్ని నాగార్జున.. సింధు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో ఆమె బంధువులు ఒక వాహనంలో అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. నాగార్జునను తమ వాహనంలో ఎక్కించుకొని తీవ్రంగా దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు గానీ.. నాగార్జున చనిపోయాడు. అతడిని కొట్టి చంపేశారని నాగార్జున తల్లి, చెల్లెలు ఆరోపిస్తున్నారు. కాగా, తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సింధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగార్జున, డాక్టర్ కృష్ణ, అతడి భార్య హైమావతి ఇదంతా చేశారని చెప్పారు. డాక్టర్ కృష్ణ తమ కూతురిని పలుమార్లు లైంగికంగా వేధించాడని తెలిపారు. నాగార్జున మృతిపై అతడి కుటుంబీకులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

కొత్తూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓ 16 నెలల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడి మృతిచెందింది. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్‌లో శనివారం జరిగింది. బిహార్‌కు చెందిన ధర్మేందర్ దంపతులు కొత్తూర్ నారాయణగూడ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ధర్మేందర్ శనివారం పనికి వెళ్లాడు. అతని భార్య ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా పెద్ద కుమార్తె రుయా (16 నెలల) ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడిపోయింది. నీటి బకెట్‌లో చిన్నారి మృతి చెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

అప్పులు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య

ఖానాపూర్, జనవరి 13 : పత్తి పంట దిగుబడి రాకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం చందునాయక్ తండాకు చెందిన గుగ్లావత్ శ్రీకాంత్ (26) రెండు ఎకరాల్లో పత్తి వేశాడు. ఈ సారి ఆశించినంత దిగుబడి రాలేదు. దీనికి తోడు తన అక్క పెళ్లి కోసం చేసిన రూ.3 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మథన పడేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

బస్సు మంటల్లో మసైపోయి..

గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. చెలరేగిన మంటలు.. మహిళ సజీవ దహనం



మంటల్లో పూర్తిగా కాలిపోయిన బస్సు, ఇన్‌సెట్లో.. మాలతి(ఫైల్)

గద్వాల, గద్వాల క్రైం /ఎర్రవల్లి, నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడ్డ ఆ బస్సుకు అంటుకున్న మంటలు పెద్దవి కాకమునుపే ప్రయాణికుల్లో కొందరు ఎలాగో అలా బయటపడ్డారు. చాలామందిని స్థానికులే రక్షించారు. ఒక్క మహిళ మాత్రం ఆ బస్సులోనే ఉండిపోయింది. రాకాసి మంటలు కోరలు చాస్తూ బస్సు అంతటా వ్యాపించాయి. ఆ మంటల్లో ఆమె కాలిబూడిదై పోయింది. ఈ హృదయవిదారక ఘటన గద్వాల జిల్లాలో జరిగింది. హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు శనివారం తెల్లవారు జామున బీచుపల్లి-ఎర్రవల్లి మధ్య బోల్తా పడింది. ఆ వెంటనే బస్సు ముందు భాగంలో మంటలంటున్నాయి. మృతురాలిని ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మాలతి (45)గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటలకు ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి చిత్తూరుకు బయలుదేరింది. బస్సుల్లో 42 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల దాబా దాకా ఒక డ్రైవర్ బస్సు నడిపాడు. తర్వాత ఒంటి గంట సమయంలో స్టీరింగ్ రెండో డ్రైవర్ తీసుకున్నాడు. బీచుపల్లి దాటిన తర్వాత, పదవ బెటాలియన్ సమీపంలో తెల్లవారుజామున 2.30 గంటలకు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. పక్కనే ఉన్న హార్వెస్టర్ గ్యారేజీ కార్మికులు, పెట్రోల్ బంక్ వర్కర్లు హుటాహుటిన స్పందించారు. బస్సు అద్దాలను పగులగొట్టి ప్రయాణికులను కాపాడారు. పోలీసులు కూడా సహాయక చర్యలు చేపట్టారు.ఆ వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. మంటల్లో మాలతి అనే ప్రయాణికురాలు చిక్కుకుపోయారు. ఆమె చెయ్యి బస్సు సీటు సందులో ఇరుక్కుపోవడంతో తప్పించుకునేందుకు వీల్లేకపోయినట్లు తెలుస్తోంది. కాపాడండి అంటూ ఆమె ఆర్తనాదాలు చేస్తున్నా, అప్పటికే మంటలు తీవ్రం కావడంతో ఎవరూ ఆమెను రక్షించే సాహసం చేయలేకపోయారు. అందరి కళ్ల ముందే ఆమె సజీవ దహనమయ్యారు. మాలతిది చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, పుత్తమర్ల గ్రామం. ఆమె హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని రైస్ రీసెర్చ్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భర్త శ్రీనివాస్ కూడా హైదరాబాద్‌లోనే వ్యాపారం చేస్తుండటంతో ఆ కుటుంబం నగరంలోని లంగర్‌హౌజ్‌లో ఉంటోంది. భర్త శ్రీనివాస్ తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో రెండ్రోజుల క్రితం ఆమె చిత్తూరుకు వెళ్లిపోయారు. మాలతి కూడా శుక్రవారం రాత్రి బస్సులో సొంతూరుకు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఘటన జరగ్గా, ఉదయం ఏడు గంటల దాకా మాలతి మృతదేహం కాలుతూనే ఉంది.. తన కళ్ల ముందే మాలతి మంటల్లో సజీవదహనమైందని గద్వాల వాస్తవ్యుడు కలీం అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. హైదరాబాద్ నుంచి ఊరికి వెళుతుండగా బస్సుకు మంటలంటుకోవడాన్ని గమనించి అక్కడికి వెళ్లాలని ఆయన చెప్పారు. కాగా డ్రైవర్ నిద్రమత్తే బస్సు ప్రమాదానికి కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలోనే మాలతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ఘటనాస్థలికి వెళ్లారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. 2002 సెప్టెంబరు 5న గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపురం వద్ద హైదరాబాద్ నుంచి కడప జిల్లా రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 31 మందిలో 13 మంది చనిపోయారు. మరో 18 మందికి తీవ్రగాయాలయ్యాయి. 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన వాల్వో బస్సు కొత్తకోట మండలం పాలెం వద్ద కల్వర్టుకు ఢీకొని రాసుకపోవడంతో మంటలు చేలరేగి బస్సుకు మంటలంటుకున్నాయి.. ఈ ఘోర దుర్ఘటనలో 45 మంది సజీవదహనం అయ్యారు.

గుంతలోకి 3 వాహనాలు.. తల్లి, కొడుకు దుర్మరణం!

- ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టిన కారు
- అదుపుతప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్న ఆటో
- 3 వాహనాలూ గుంతలోకి.. కారులోని తల్లి, కుమారుడి మృతి

శంషాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక వాహనం అదుపు తప్పడం.. ఆ వాహనంతో పాటు మరో రెండు వాహనాలను ప్రమాదం బారిన పడేసింది! మూడు వాహనాలూ రోడ్డు పక్కన ఓ గుంతలో పడ్డాయి. ప్రమాదానికి గురైనవి కారు, ఆటో, బైక్! ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తల్లి, కొడుకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఘాంసిమియాగూడ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. శంషాబాద్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కాప్రా మునిసిపాలిటీ శ్రీరాంనగర్‌కు చెందిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సైంటిఫిక్ ఆఫీసర్ మెరువ ఆదిశేషారెడ్డి(57), తల్లి రాములమ్మ(88)తో కలసి కారులో హైదరాబాద్ నుంచి నంద్యాలకు వెళుతున్నారు. ఘాంసిమియాగూడ వద్దకు రాగానే కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఫలితంగా ఆటో అదుపుతప్పి దాని ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఫలితంగా మూడు వాహనాలు ఒకదాని వెంట మరొకటి హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం నిర్మించిన కల్వర్టులో బోల్తాపడ్డాయి. ప్రమాదంలో కారులో ఉన్న ఆదిశేషారెడ్డి, రాములమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ఉన్న గొల్ల ఆంజనేయులు, వెనుక కూర్చున్న పద్నాలుగేళ్ల బాలిక, ఆటోడ్రైవర్ రాయన్నగూడ సిద్ధయ్య గాయపడ్డారు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు రోడ్డుపక్కనే పడిపోగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తల్లీకుమారుల మృతదేహాలను కల్వర్టు నీటిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పండుగ సరుకుల కోసం వచ్చి..

పరలోకాలకు!

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చేర్యాల, జనవరి 13: సంక్రాంతి పండుగకు సరుకులు కొనేందుకు బయటికి వచ్చిన మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాటర్‌పిల్లర్ మెషీన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి(39) శనివారం చేర్యాలకు పండుగ కోసం సరుకులు కొనేందుకు వచ్చింది. తర్వాత ఇంటికి వెళ్లేందుకు చూస్తుండగా తమ ఇంటి సమీపంలోని బంధువు కనకారెడ్డి కలిసి టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై దొమ్మాటకు వెళ్తూ ఎక్కించుకున్నాడు. ఇటు జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణ శివారులో కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. అక్కడ చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకొని కాటర్ పిల్లర్ మెషీన్‌తో ఆపరేటర్ నిర్లక్ష్యంగా కంకర మిశ్రమాన్ని చదును చేస్తూ వెనక వైపునకు తోలుతున్నాడు. ఇంతలో వెనక నుంచి వస్తున్న కనకారెడ్డి బండి అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడిపోయారు. అది గమనించని ఆపరేటర్ మెషీన్‌ను లక్ష్మి పైనుంచి తీయడంతో ఆమె మృతి చెందింది. కనకారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మృతురాలి కుటుంబీకులు, బంధువులు చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట రహదారిపై బైఠాయించారు.

పతంగి ఎగురవేస్తుండగా

విద్యుత్తు షాక్

- అత్తాపూర్‌లో 11 ఏళ్ల బాలుడి దుర్మరణం
- రైలు పట్టాలపై పడిన గాలి పటం
- నవాంద్గీ స్టేషన్‌లో రైలు ఢీకొని బాలుడి మృతి

రాజేంద్రనగర్/బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భవనంపై ఉన్న ఏసీ కాపర్ పైప్‌లైన్‌ను విద్యుత్ ప్రసారం జరిగి.. కరెంటు షాక్‌తో ఓ బాలుడు చనిపోయాడు. రాజేంద్రనగర్‌లో ఈ ఘోరం జరిగింది. అత్తాపూర్ రాంబాంగ్ మల్లయ్య టవర్స్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన అభిషేక్ కుటుంబం ఉంటోంది. అభిషేక్ సోదరుడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. అభిషేక్ వదిన చాలారోజుల క్రితం ఎటో వెళ్లిపోయింది. దీంతో వారి కుమారుడు తనిష్క్(11) పెదనాన్న అభిషేక్ వద్దే ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా అభిషేక్ కుమారుడు మోహిత్ పతంగి ఎగురవేసేందుకు మల్లయ్య టవర్స్ ముందు ఉన్న లక్ష్మీవాణి టవర్స్ పైకి వెళ్లాడు. అతడితో తనిష్క్ కూడా వెళ్లాడు. లక్ష్మీవాణి అపార్ట్‌మెంట్స్ పెంట్‌హౌస్‌పై ఇద్దరూ పతంగి ఎగురవేస్తుండగా అక్కడ ఏసీ ఔట్‌పుట్ కాపర్ పైప్‌లైన్‌కు తనిష్క్ తగిలాడు. దానికి అప్పటికే విద్యుత్తు ప్రసారం జరగడంతో షాక్‌తో చనిపోయాడు. గాలిపటం కోసం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని బాలుడు చనిపోయాడు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గీ రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. బషీరాబాద్ మైనారిటీ కాలనీకి చెందిన అస్లామ్ కుమారుడు అబుజార్(9) గాలి పటం ఎగరేస్తున్నాడు. అది తెగి ఇంటి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలపై పడటంతో పతంగి తీసుకునేందుకు బాలుడు పరుగు తీశాడు. అప్పటికే స్టేషన్‌లో గూడ్స్ రైలు ఆగి ఉండటంతో దాని కింది నుంచి దూరి అటువైపు వెళ్తుండగా మరో ట్రాక్‌పై వస్తున్న రైలు ఢీకొట్టింది.

ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత

మహిళలకు ధ్యానం ఎంతో అవసరం : మహబూబాబాద్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ సుంకరనేని నాగవాణి



బహుమతులు పొందిన మహిళలతో సుంకరనేని నాగవాణి

చిన్నగూడూరు (మహబూబాబాద్ జిల్లా), జనవరి 13: ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మహబూబాబాద్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ సుంకరనేని నాగవాణి అన్నారు. శనివారం చిన్నగూడూరు మండలంలోని జయ్యారం గ్రామంలో 'హార్ట్‌ఫుల్ నెస్ ఆధ్యాత్మిక ధ్యాన శిక్షణ సంస్థ' జయ్యారం ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 200 మంది ఉత్సాహవంతమైన మహిళలు పాల్గొన్నారు. దీంతో జయ్యారంలో సంక్రాంతి సందడి వాతావరణం ఒకరోజు ముందే నెలకొంది. విజేతలతో పాటు ముగ్గుల పోటీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి హార్ట్ ఫుల్ నెస్ ధ్యాన శిక్షణ సంస్థ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సుంకరనేని నాగవాణి మాట్లాడుతూ.. పనిఒత్తిడితో కూడుకున్న నేటి మహిళలకు ధ్యానం ఎంతో అవసరమని అన్నారు. ధ్యానం చేయడం ద్వారా సమాజ అభివృద్ధి త్వరితగతిన జరుగుతుందని, హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ నిస్వార్థంగా, శాస్త్రీయ పద్ధతిలో ఉచితంగా అందించే ధ్యానంను ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. ధ్యానంతో ధైర్యంగా త్వరితగతిన నిర్ణయాలు జరిగి, మహిళలు అన్నిరంగాల్లో ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పద్మ వెంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ రాధ ముత్తయ్య, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ, శిక్షకులు నరేందర్, వెంకటయ్య, విజయ, జనార్ధనాచారి, కేశవరావు, కవిత, జగన్నాథరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

'చలో మేడారం' ఫోక్ సాంగ్ చిత్రీకరణ



షూటింగ్‌లో డ్యాన్స్ వేస్తున్న కళాకారులు

మేడారం, జనవరి 13: తాడ్వాయి మండలం మేడారంలో సమ్మక్క, సారలమ్మ ఫోక్ హంగామా ప్రొడక్షన్ ఆధ్వర్యంలో 'చలో మేడారం' సాంగ్ చిత్రీకరణను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాత డాక్టర్ కిన్నెర స్వాతి మాట్లాడుతూ.. వనదేవతలకు మొక్కులో భాగంగా ఈ చిత్రాన్ని మేడారంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు సమక్షంలో తల్లుల ప్రధాన గేటు ముందు ఐల్యాండ్ వద్ద ప్రారంభించామన్నారు. సాంగ్ ప్రారంభంలో పూజారుల పరిచయం ఉంటుందని తెలిపారు. ఈ చిత్రం మూడు రోజులు మేడారంలో జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో రూపొందించనున్నట్లు తెలిపారు. చిత్రం ద్వారా 900 మందికి ఉపాధి కల్పిస్తున్నామని, పూర్తి చేయడానికి రూ.22లక్షల ఖర్చు అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు జాన్ రఘు, సంగీత దర్శకుడు ఎస్‌కే బాజీ, సిబ్బంది, కళాకారులు, సినీ బృందం పాల్గొన్నారు.

వ్యవసాయ పంపు సెట్లకు జియో టాగింగ్ లేదు

నయీంనగర్, జనవరి 13: ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని వ్యవసాయ పంపుసెట్లకు జియో ట్యాగింగ్ చేయడం లేదని టీఎస్ఎన్ పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి స్పష్టం చేశారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడారు. 2021వ సంవత్సరంలో డీటీఆర్ (డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్)లను 11 కేవీ ఫీడర్ లైన్ల మ్యాపింగ్ కోసం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఒక పత్రికలో 'వ్యవసాయానికి జియో ట్యాగింగ్ ' అని ప్రచురితమైన, వాట్సాప్‌లో వైరల్ అవుతున్న వార్త పూర్తిగా తప్పుడు వార్త అని, అవాస్తవమని సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు.

మొండ్రాయి యువకుడు జియో సైంటిస్ట్‌గా ఎంపిక



శ్రీకాంత్

సంగెం, జనవరి 13: మండలంలోని మొండ్రాయి గ్రామానికి చెందిన రైతు బిడ్డ సింగిరెడ్డి శ్రీకాంత్ జియో సైంటిస్టుగా(గెజిటెడ్ అధికారిగా) ఎంపికయ్యారు. శుక్రవారం వెలువడిన యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) గ్రూపు-ఎ ఫలితాల్లో శ్రీకాంత్ 113వ ర్యాంక్ సాధించారు. ప్రిలిమరీ పరీక్ష(హాల్‌టికెట్ నంబరు 1090478) గత యేడాది ఫిబ్రవరి 18న, మెయిన్స్ జూన్ 25, 26 తేదీల్లో రాశారు. గత డిసెంబరు 5న ఢిల్లీలో ఇంటర్వ్యూకు హాజరయ్యారు. కాగా, ఈనెల 12న ఫలితాలు విడుదల కాగా, శ్రీకాంత్ 113వ ర్యాంకు సాధించారు. పదో తరగతి వరకు గ్రామంలో, ఇంటర్ నర్సంపేటలో పూర్తి చేశారు. డిగ్రీ హనుమకొండలో, ఎమ్మెస్సీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు.

శ్రీకాంత్ జియో సైంటిస్టుగా ఎంపిక కావడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. శ్రీకాంత్ తండ్రి సింగిరెడ్డి కుమారస్వామి తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో పంటలు పండిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. తల్లి, తండ్రి అందించిన ప్రోత్సాహంతో చదువులో ముందంజలో నిలుస్తూ ప్రభుత్వ ఉద్యోగాల కోసం శ్రమించారు. తండ్రికి వ్యవసాయంలో సహకారం అందిస్తునే యూపీఎస్సీ పరీక్షలకు హాజరయ్యారు. కాగా, శ్రీకాంత్‌ను పలువురు అభినందించారు.

సమాచార హక్కు పరిరక్షణ సమితి కోఆర్డినేటర్‌గా మధు



హనుమకొండ రూరల్, జనవరి 13: జాతీయ సమాచార హక్కు పరిరక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్‌గా హనుమకొండకు చెందిన సీనియర్ జర్నలిస్టు గాడిపల్లి మధును ఎంపిక చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కన్నెబోయిన ఉషారాణి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తానని పేర్కొన్నారు.


రైలులో కిక్కిరిసి ఉండడంతో డోర్‌లో వేలాడుతూ ప్రయాణిస్తున్న యువకులు


మహబూబాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో కిక్కిరిసిన ప్రయాణికులు

బస్సులు, రైళ్లలో ఫుల్ పబ్లిక్

మహబూబాబాద్ టౌన్, జనవరి 13 : పండుగలు వచ్చాయంటే పట్టణాల్లోని జనం పల్లెలకు పయనమవుతారు. పట్టణాలు ఖాళీ కాగా.. గ్రామాలు జనంతో కళకళలాడుతాయి. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలిచే ప్రధాన రెండు పండుగలు బతుకమ్మ, సంక్రాంతికి తమ సొంతూళ్లకు తరలి వస్తారు. ఏటా బతుకమ్మ, దసరా పండుగకు కలిపి దాదాపు 10 రోజులకు పైగానే, సంక్రాంతికి ఐదు నుంచి ఆరు రోజులు పాటు విద్యాశాఖ సెలవులు ప్రకటిస్తుంది. జీవనోపాధి, ఉద్యోగ రీత్యా వివిధ పట్టణాల్లో స్థిరపడ్డ వారు తమ కుటుంబాలతో సొంత ఊళ్లకు వచ్చి పండుగలను ఘనంగా జరుపుకుంటారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో పాఠశాలలకు రాష్ట్రప్రభుత్వం సెలవులు ప్రకటించింది. దీంతో ఈనెల 12 నుంచి ప్రయాణాలు ఆరంభమయ్యాయి. ఇక ఉద్యోగులకు సైతం 13న రెండవ శనివారం, 14 ఆదివారం, 15న సంక్రాంతి పండుగ సెలవు దినం ఉండడంతో వారు కూడా తమ కుటుంబసభ్యులతో కలిసి పండుగను జరుపుకునేందుకు పెద్ద ఎత్తున పల్లెటూళ్లకు తరలివస్తున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులు, రైళ్ల జనంతో నిండిపోతున్నాయి. ఇక ఆర్టీసీ బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కళకళలాడుతున్నాయి. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు బస్సుల సంఖ్యను పెంచినప్పటికి అవి సరిపోకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. మరికొంత మంది తమకున్న సొంత వాహనాల్లో ఊర్లకు వస్తున్నారు. సంక్రాంతి పండుగ, పాఠశాల, కళాశాలలకు సెలవులు పూర్తయి తిరుగుముఖం పల్లెలకు వచ్చిన జనం తిరిగి పట్టణాలకు చేరే వరకు ఆర్టీసీ బస్సులు, రైళ్లలో ప్రయాణికుల రద్దీ ఉండనుంది.

మానుకోటలో ముగ్గుల పోటీలు

మహబూబాబాద్ టౌన్, జనవరి 13 : జిల్లా కేంద్రంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి రంగురంగుల ముగ్గులు వేశారు. మొదటి బహుమతి రూ.3,016 నగదును బోడ లావణ్య, ద్వితీయ బహుమతి రూ.2,016 నగదును గంది బిందు, తృతీయ బహుమతి రూ.1,016 నగదును మామిండ్ల సౌజన్య గెలుచుకున్నారు. విజేతలుగా నిలిచిన మహిళలకు మునిసిపల్ చైర్‌పర్సన్ భూక్య ఉమా చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకుని భావితరాలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలబిందెల మల్లయ్య, ఆకుల శంభయ్య, రవీంద్రగుప్తా, తండా సదానందం, నల్లు సుధాకర్‌రెడ్డి, గోవర్ధన్, ప్రసాద్, కృష్ణమూర్తి, శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజు, రవి, అనిల్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

● సీపీఐ, భారత జాతీయ మహిళాసమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఆధ్వర్యంలో వీరభవన్ వద్ద ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. మొదటి బహుమతి రూ.5,016 నగదును అర్షం సింధూ, ద్వితీయబహుమతి రూ.3,016 నగదును దొంతమల్ల స్రవంతి, తృతీయ బహుమతి రూ. 2,016 నగదును కోడి వెన్నెల, నాలుగవ బహుమతి రూ.1,016 నగదును శ్రావణి గెలుచుకోగా, వారికి నగదుతో పాటు బహుమతులు అందజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి, కౌన్సిలర్ నీరజ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి మామిండ్ల సాంబలక్ష్మీ, పెరుగుకుమార్, చిదిరాల జ్ఞానేశ్వర్, వెంకన్న, రేషపల్లి నవీన్, వెలుగు శ్రావణ్, పద్మ, రాణి, హలీమా,రమేష్, మాధవి పాల్గొన్నారు.


ముగ్గుల పోటీల విజేతలతో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ భూక్య ఉమా, ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు


మానుకోట పట్టణంలో ముగ్గులను పరిశీలిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి

● డబుల్ బెడ్‌రూం కాలనీలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ప్రథమ స్థానంలో కవిత, ద్వితీయ స్థానంలో శ్రీలత, తృతీయ స్థానంలో రాణి నిలవగా వారికి చీరలను బహుమతులుగా అందించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతీ మహిళకు కన్సోలేషన్ బహుమతులుగా అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా హ్యూమన్‌రైట్స్ జిల్లా అధ్యక్షురాలు ఉమాదేవి, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు స్రవంతి వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు సుమతి, కావ్య, శ్రావణి పాల్గొన్నారు.

సంక్రాంతి శోభ

(5వ పేజీ తరువాయి)

పురస్కరించుకొని పలు షాపుల్లో పతంగులు, ఇంటి ముంగిట్లో మహిళలు అందమైన రంగవళ్లులు వేసేందుకు వివిధ రకాల ముగ్గులను పట్టణ నలుమూలల నుంచి వచ్చిన మహిళలు, చిన్నారులు కొనుగోళ్లు చేశారు. జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల ప్రజలు సంక్రాంతి వేడుకలను జరుపుకునేందుకు ప్రజలు సిద్ధం కాగా అందుకనుగుణంగా వ్యాపారులు సైతం వేడుకలకు సంబంధించిన గ్రీటింగ్స్‌ను విక్రయించేందుకు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇక మహిళలు తమ ఇళ్ల ముందు అందంగా ముగ్గులను అద్దేందుకు వివిధ రకాల రంగులు, చిన్నారుల నుంచి మొదలుకొని పెద్దల వరకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు గ్రీటింగ్స్ అప్పుడే మార్కెట్‌లోకి వచ్చాయి.


పిండివంటలను తయారు చేస్తున్న మహిళలు


మానుకోటలో రంగులను కొనుగోలు చేస్తున్న మహిళలు

నూతన సంవత్సరం మొదలు కొని మకర సంక్రాంతి పర్వదినం వరకు పిల్లలు ఎగురవేసుకునేందుకు వెరైటీ పతంగులు మానుకోటకు చేరుకున్నాయి. రాజకీయ నాయకులు, సినీతారల ఫొటోలతో పాటు తాజ్‌మహల్, చార్మినార్, ఎర్రకోట చిత్రాలతో కలిపి పతంగులను తయారు చేశారు. ముందుగానే మార్కెట్‌లోకి వచ్చిన పతంగులు, గ్రీటింగ్ కార్డులు చూపరులను ఆకర్షిస్తున్నాయి. గ్రీటింగ్‌కార్డులు, పతంగులు, ముగ్గులకు ఉపయోగించే వివిధ రకాల రంగులు భారీగానే మార్కెట్లో విక్రయిస్తున్నారు. జిల్లాలోని లోగిళ్లు అన్నీ బంధుమిత్రులతో సందడి నెలకొంది.

పతంగులు ఎగిరివేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

మహబూబాబాద్ రూరల్, జనవరి 13 : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పతంగులు ఎగిరివేసేటప్పుడు చిన్నారులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి జె.నరేష్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. పతంగులు ఎగిరివేసేటప్పుడు విద్యుత్ తీగలు, సెల్‌ఫోన్ టవర్లు ఉన్న చోట పతంగులను ఎగురవేయకూడదన్నారు. విద్యుత్ తీగలు, స్తంభాలు, చెట్లపై పతంగులు పడితే తీసుకునే ప్రయత్నం చేకూడదన్నారు. రోడ్ల వెంట గాలిపటాల కోసం పరుగులు పెట్టకూడదన్నారు. ప్రమాదాన్ని ప్రాణం మీదకు తెచ్చుకోకూడదని స్పష్టం చేశారు. ఇంటి స్లాబ్‌లపై విద్యుత్ లైన్ ఉన్న దగ్గర ఎట్టి పరిస్థితుల్లో పతంగులను ఎగురవేయకుండ తల్లిదండ్రులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఆరుబయట, ఖాళీ ప్రదేశాల్లో, మైదాన ప్రాంతాల్లో మాత్రమే పతంగులను ఎగురవేయాలన్నారు.

ఇరుముడి ధరించిన జడ్పీటీసీ బృందం

కేసముద్రం, జనవరి 13 : కేసముద్రం విలేజి ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం గురుస్వామి గాంతి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డితోపాటు తన బృందంలోని మాలధారులు ఇరుముడి ధరించారు. ఆలయంలో ధన్నసరి సర్పంచ్, సొసైటీ డైరెక్టర్ కొండ్రెడ్డి శ్రీవాణి, రవీందర్ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఊరేగింపుగా అయ్యప్ప నామస్మరణతో శబరిమలైకి బయలుదేరారు. కార్యక్రమంలో బానోత్ శంకర్‌నాయక్, రాజు, లచ్చు, సరికొండ ప్రశాంత్‌రెడ్డి, రాజశేఖర్, వాల్యా, నరేష్, పెద్దోజు నరేష్, సంపత్, రావుల శ్రీకాంత్‌రెడ్డి, నాగ బ్రహ్మచారి, గాంతి జ్యోతేందర్ రెడ్డి పాల్గొన్నారు


బహుమతి అందజేస్తున్న మంత్రి సీతక్క కోడలు కుసుమాంజలి

జేఎల్ఎన్‌వైసీ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు

కొత్తగూడ, జనవరి 13 : సంక్రాంతి పండుగ సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ యువజన సంఘం (జేఎల్ఎన్‌వైసీ) ఆధ్వర్యంలో కొత్తగూడలో శనివారం ముగ్గుల పోటీ నిర్వహించారు. ముగ్గుల పోటీని ఎస్సై నగేష్, మంత్రి సీతక్క కోడలు కుసుమాంజలి ప్రారంభించారు. మహిళలు, యువతులు ముగ్గుల పోటీలో ఉత్సాహంగా పాల్గొని, ముగ్గులు వేశారు. మైదం ప్రభ మొదటి బహుమతి, కీర్తిప్రియ రెండో బహుమతి, మెరుగు శిల్ప మూడో బహుమతి, రమ నాలుగవ బహుమతి సాధించారు. మంత్రి సీతక్క కోడలు కుసుమాంజలి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ విజయరూప్‌సింగ్, జడ్పీటీసీ పుల్సం పుష్పలత శ్రీనివాస్, జేఎల్ఎన్‌వైసీ అధ్యక్షుడు, సర్పంచ్ మల్లెల రణధీర్, ఎంపీటీసీ హలావత్ సాలూకీ సురేష్, మాజీ వైస్ ఎంపీపీ పూల యాదగిరి, గ్రామ పెద్దలు గుమ్మడి సమ్మయ్య, మల్లెల బాబు, అల్లెం గణేష్, మల్లెల రాము, యువజన సంఘం సభ్యులు మల్లెల వీరాస్వామి, ఏంపల్లి రమేష్, యాదగిరి కిరణ్, ఏంపల్లి కృష్ణ, బిరుదు అమర్, ప్రదీప్, ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు మిడతపల్లి యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

'గొల్లకురుమలు ఐక్యంగా ఉద్యమించాలి

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 13 : గొల్లకురుమల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వయ్యావుల మల్లయ్య, బొల్లం అశోక్ పిలుపునిచ్చారు. శనివారం నూతన సంవత్సర క్యాలెండర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గొర్రెల పంపిణీ కోసం కొన్ని నెలలుగా ఎదురుచూస్తున్నారని, రెండోవిడత గొర్రెల పంపిణీ పూర్తి చేయాలని వారు కోరారు. సంఘం నాయకులు గోగుల అనూరాధరాజు, అవుల శ్రీనివాస్, మల్లయ్య, గుండ్రకోటి కుమార్, మహేష్, ఎడ్ల శ్రీనివాస్, రఘు, మల్లేష్, లింగయ్య, యాకయ్య, వెంకట్‌యాదవ్,మురళీనాయక్ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి చేయూత

కేసముద్రం, జనవరి 13 : మండలంలోని కాట్రపల్లిలో శనివారం ఎదరబోయిన లచ్చమ్మ మృతి చెందడంతో ఆమె కుటుంబానికి సమ్మిగౌడ్ ఫౌండేషన్ తరపున వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో దుప్పటి సూరయ్య, యాకన్న, సామల నర్సయ్య, జల్లె యాకాంబ్రం, పుట్ట ప్రభాకర్, చాగంటి యాదగిరి, చీకటి ప్రశాంత్, శీలం మహేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడు హఠాన్మరణం


శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

బయ్యారం, జనవరి 13 : సౌమ్యునిగా ప్రజల మన్ననలు పొందిన స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయుడు ముత్తిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి (59) శనివారం హఠాన్మరణం చెందాడు. కుటుంబసభ్యులు, ఉపాధ్యాయ సంఘం నేతలు తెలిపిన వివరాల ప్రకారం. బయ్యారంలో శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం రాత్రి కుటుం బసభ్యులతో కలిసి భోజనం చేసి, నిద్రించాడు. అనంతరం శనివారం తెల్లవారు జామున అకస్మాత్తుగా చెమటలు రావడంతో కుటుంబికులు హుటాహుటినా ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యం నిర్వహిస్తుండగానే శ్రీనివాస్ రెడ్డి తుదిశ్వాస విడిచారు. బ్రెయిన్ స్ట్రోక్‌తోనే ఆయన మృతి చెందినట్లు తెలుస్తుంది. కాగా, శ్రీనివాస్‌రెడ్డి ప్రస్తుతం బయ్యారం మండల కేంద్రంలోని బంజర తండా ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అలాగే శ్రీనివాస్‌రెడ్డి గతంలో ఓ మారునాటి ఖమ్మం జిల్లా కలెక్టర్ చేతుల మీదిగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందారు.

'సన్'క్రాంతి విశిష్టత


- సంప్రదాయ పండుగకు శాస్త్రీయ గుర్తింపు
- పూర్వీకులు, గురువుల అధ్యయనంతోనే విశిష్టత
- అందుకే.. ఉత్తరాయణం కోసం భీష్ముడి నిరీక్షణ


మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 13 : ఏటేటా నేలమ్మ తల్లి ఈనినట్టు.. పచ్చని పైరులు పరవశించి పోయే పండుగంటూ ఒకటి ఉందంటే.. అది సంక్రాంతి..! ఈ పండుగ వస్తుందంటే చాలు... రైతన్నల లోగిళ్ల పంటల రాసులతో కళకళలాడుతుంటాయి. మరోపక్క ఆకాశంలో స్వేచ్ఛా విహంగాలు పురివిప్పుకున్నట్టు రంగురంగుల పతంగులు... స్వైర విహారం చేస్తాయి. మంచు పరదాలు దాటి చలిలోగిళ్లలో గంగిరెద్దుల విన్యాసాలు, డూ..డూ బసవన్నలు, హరిదాసుల వేషధారణలు, పాటలు వెరసి తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగ సందడి చేస్తోంది.. ప్రతి పండుగలాగే ఈ సంక్రాంతి వెనుక శాస్త్రీయ కోణం దాగి ఉంది.

పండగ ప్రాశస్త్యం వెనుక ఇది...

నమ్మకం మనిషిని నడిపించినట్టే పండుగ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న ప్రతీ ఒక్కరు ఖగోళశాస్త్ర పరంగా పండుగ ప్రాశస్త్యం తెలిపే చిరు ప్రయత్నమిది. గణితశాస్త్ర గణనప్రకారం సౌరసంవత్సరం శాస్త్రీయంగా ఉందని శాస్త్రవేత్తలు చెబుతారు. మకర సంక్రాంతి ఏటా జనవరి 14న రావడం దీనికి నిదర్శనమని పేర్కొంటారు. ఒక్కోసారి మకర రాశి ప్రవేశానికి అనుగుణంగా సూర్యగమనంలో మార్పులతో 15న కూడా రావచ్చని వేదపండితులు, జ్యోతిష్యశాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. అందులో భాగంగానే ఈ సంవత్సరం 14న భోగి, 15న మకర సంక్రాంతి పండుగ జరుపుకుంటున్నారు. ఆంగ్ల సంవత్సరంలోని 365 రోజుల్లాగే సౌరసంవత్సరంలోను 365 రోజులు ఉండడం విశేషం. అయితే చంద్రమానంలో 354 రోజులు ఉండడంతో దీని ఆధారంగా మిగిలిన పండుగలు జరుపుకునే నేపథ్యంలో హిందూపండుగల తేదీల్లో మార్పులు సహజం. సౌరసంవత్సరానికి మాత్రం ఈ మార్పులు అప్పుడప్పుడు స్వల్ప తేడాతో ఒకరోజు ఉండవచ్చని పండితులు పేర్కొంటున్నారు.

పూర్వీకులు, గురువుల అధ్యయనం..


సంక్రాంతి పండుగ ఖగోళ కోణంలో రాశులు తెలియజేసే చిత్రం (ఫైల్)


మకర రాశిలో సూర్యుడు ప్రవేశించే గమన చిత్రాలు (ఫైల్)

అంతరిక్షంలో జరుగుతున్న అనేక పరిణామాల క్రమంలో భూమి మీదఉన్న ప్రతీప్రాణినీ ఎలా ప్రభావితం చేస్తాయో మన పూర్వికులు, గురువులు ఎంతగానో అధ్యయనం చేసి ఆ జ్ఞానాన్ని మనకు వారసత్వంగా ఇచ్చారు. సౌరకుటుంబంలో సూర్యుడు మనిషిని ప్రభావితం చేస్తాడు. అందుకే సూర్యునికి సంబంధించిన ప్రతీ అంశం మానవ సంబంధంగా ఎంతో ముఖ్యమైనదిగా పేర్కొంటారు. సూర్యుడిని ప్రత్యక్ష దైవంగానే భావిస్తారు. సూర్యుడు అన్ని జీవరాశులకు ఆధారం. ఆలంబన అందించే అద్భుతమైన తేజోరాశి. ఖగోళ శాస్త్రం 'రవి'ని స్థిరతారగా గుర్తించి అన్ని గ్రహాలు ఆదిత్యుని చుట్టూ పరిభ్రమిస్తాయని రుజువు చేసింది. ఆ క్రమంలోనే మనం అనుసరించేది చూసేది గ్రహకూటముల, నక్షత్ర రాశుల గతులు, సూర్యగమనం మాత్రమే.

మకర సంక్రాంతి అంటే..

సంక్రాంతి పండుగలో సంప్రదాయమే కాదు.. ఖగోళకోణం దాగి ఉంది. ఖగోళశాస్త్ర ప్రకారం పన్నెండు రాశులు. సూర్యుడు నెలకొక రాశిలో కాలం గడిపి ఆపై ఆ రాశిని వదలి తర్వాత వచ్చే రాశిలో ప్రవేశిస్తాడు. సూర్యుని ప్రవేశంతో రాశికి సూర్యుడు సంక్రమిస్తాడు. అదే సంక్రమణం. దీనినే సంక్రాంతి అని వ్యవహరిస్తారు. అలా సూర్యుడు పన్నెండు రాశులకు పన్నెండు సంక్రాంతులు కలిగిస్తాడు. ఇందులో ముఖ్యమైనదే మకర సంక్రాంతి. అంటే సూర్యుడు మకరరాశిలో ప్రవేశించడం. ఇది సూర్యుని ఉత్తరదిక్కు ప్రయాణం. ఈ ప్రయాణాన్నే అయనం లేదా ఆయణం అంటారు. ఉత్తరాయణం శుభప్రదమైనది. ఇది పుణ్యకాల ప్రారంభం. ఈ పుణ్యకాలంలో శుభకార్యాలు జరుపుకుంటారు.

మహాభారతంలోను ఉత్తరాయణంకు ప్రత్యేకత ఉంది. ఈ పుణ్యకాలం కోసమే తండ్రి శంతనుని నుంచి స్వచ్ఛంద మరణం వరంగా పొందిన కురు పితామహుడైన భీష్ముడు కురుక్షేత్ర యుద్ధంలో విపరీతంగా గాయపడి ఒరిగినపుడు అర్జునుడు అమర్చిన అంపశయ్యపై ఉత్తరాయణ ఆరంభమయ్యే వరకు నిరీక్షించాలనుకుంటాడు. బాంధవ్య బాధ్యతల గుర్తెరగడానికి సూర్యుడు తన కుమారుడు శని ఇంటికి వెళ్లాడని, రాక్షసులను సంహరించడానికి విష్ణుమూర్తి మందరపర్వతాన్ని సృష్టించాడని, అలాగే భీష్ముడు ఉత్తరాయణ పుణ్యకాలంలో మరణించాడని పురాణాల్లో పేర్కొంటారు.

ఉత్తరాయణంలో సంక్రాంతి..

ఉత్తరాయణ శుభారంభం అయిన మకర సంక్రాంతి చాల విశిష్టమైనది. ఉత్తరాయణంలో సూర్యునిగమనం ఉత్తరముఖంగా మారడంతో పగటి కాలం క్రమంగా పెరుగుతూ వస్తుంది. సూర్యరశ్మి క్రిమి సంహారిణి. అది అందరికి ఆరోగ్యాన్ని కలిగిస్తుంది. అయితే సూర్యునికిరణాలు ఎక్కువగా సోకితే అది కూడా మంచిదికాదు అంటారు. సూర్యరశ్మిలోని అతి నీలలోహిత కిరణాలు చర్మవ్యాధులను, చర్మ సంబంధమైన కాన్సర్‌ను ఇతర రుగ్మతలను కలిగిస్తుందని కూడ చెబుతారు.

తిథితో సంబంధం లేని పండుగ..

తిథితో సంబంధంలేని మూడు రోజుల పండుగే సంక్రాంతి. మొదటి రోజు ఆదివారం 14న భోగి, 15న సోమవారం మకర సంక్రాంతి, 16న మంగళవారం కనుమ (పశువులను పూజించే) పండుగ. తొలి రోజు భోగీ పండుగ నాడు ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు భోగిపండ్లు పోయడం వల్ల బాలారిష్టాలు, ఇతర దోషాలు తొలిగిపోతాయని విశ్వసిస్తారు.


మహాభారతంలో ఉత్తరాయణం కోసం భీష్ముడి నిరీక్షణ (ఫైల్)

వైభవంగా శ్రీగోదా రంగనాథుల కల్యాణం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 13 : మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా కేంద్రంశివారు అనంతాద్రి స్వయంభూ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం శ్రీగోదారంగనాథుల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. కల్యాణ వేదికపై గోదారంగనాథస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడే గొడవర్తి చక్రధరాచార్యులు, శ్రావణ్‌కుమారచార్యులు, విజయస్వామిల వేదమంత్రోచ్ఛరణల నడుమ భక్తిశ్రద్ధలతో కల్యాణాన్ని నిర్వహించారు. మకర సంక్రాంతి సందర్భంగా ఉత్తరాయణ పుణ్యకాలంలో శ్రీగోదా రంగనాథుల కల్యాణాన్ని జరిపిస్తే ప్రజలకు సుఖశాంతులు, అష్టైశ్వర్యాలతో తులతూగుతారని అర్చకులు వివరించారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కల్యాణోత్సవంలో మహబూబాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్-ఉమా దంపతులు పాల్గొని, ప్రత్యేక పూజలు చేయగా నూకల నర్సింహారెడ్డి-అరుణ దంపతులు, జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ కోడి నాగలక్ష్మీశ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు


భోగి మంటలు వేస్తున్న మహిళలు

తొర్రూరు, జనవరి 13 : సంక్రాంతి పండుగ ముందస్తు వేడుకలను శనివారం తొర్రూరు డివిజన్‌కేంద్రంలోని వివిధ వార్డుల్లో మహిళలు తెల్లవారు జాము నుంచే భోగి మంటలు వేస్తూ, పింటి వంటలు చేస్తూ, ముగ్గులు వేస్తూ ఎంతో ఉత్సాహంగా గడిపారు. తెల్లవారు జాము నుంచే ముగ్గులు వేస్తూ, పిండివంటలు చేస్తూ కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా గడిపారు. భోగిరోజు భోగిపండ్లు, బొమ్మల కొలువు, పండుగరోజు పిండివంటలు, కనుమ రోజు పశువులు, వాహనాల అలంకరణ చేస్తూ ఉత్సాహంగా గడుపుతామని తెలిపారు. పట్టణంలోని బీరప్ప నగర్‌లో మహిళలు ఒకేచోట చేరి ఉత్సాహంగా భోగి మంటలువేస్తూ ఆనందంగా గడిపారు. సంక్రాంతి సంబరాలను నిర్వహించుకున్నారు.

అనారోగ్యంతో రేషన్‌డీలర్ మృతి

డోర్నకల్, జనవరి 13 : మండలంలోని వెన్నారానికి చెందిన రేషన్‌డీలర్ తాళ్లపల్లి గోపయ్య (60) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. గోపయ్య మృతిపట్ల మండల రేషన్‌డీలర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మా, గుండ్రాల భాస్కర్, మల్లం అనిల్ సంతాపం తెలిపారు. వారికి కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం


నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న సంఘం బాధ్యులు

డోర్నకల్, జనవరి 13 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో టీఎస్‌యూటీఎఫ్ ముందుంటుందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి నామ వెంకటేశ్వర్లు అన్నారు. డోర్నకల్‌లో జడ్పీహైస్కూల్లో శనివారం టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆపై మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎండి.అబ్దుల్ అజీజ్, ప్రధాన కార్యదర్శిగా శివప్రసాద్, గౌరవ అధ్యక్షులుగా వెంకటప్పయ్య, కోశాధికారిగా కాసు మారెడ్డి, ఉపాధ్యక్షులుగా డేవిడ్, కార్యదర్శులుగా ఎస్‌కె.అమీన్, సీతారాములు, అమీనా, లక్ష్మీప్రసాద్, నాగరాజు, శాంతకుమారి, అనూష, కన్వీనర్లుగా రామునాయక్, రాములును ఎన్నుకున్నారు. అనంతరం సంఘం నూతన క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నిజామియా, వివేక్, వరలక్ష్మి, గ్రేసమ్మ, సాత్విక్, బాలమురళీకృష్ణ జడ్పీ హైస్కూల్ హెచ్ఎం నర్సింహారావు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

డోర్నకల్, జనవరి 13 : డోర్నకల్ కాంగ్రెస్ నాయకులు కాలా సుమీర్‌చంద్‌జైన్, మాద శ్రీనివాస్‌లు శనివారం హైదరాబాద్‌లో వరంగల్ మాజీ ఎంపీ ఆర్.సురేందర్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులను ఏకతాటిపైకి తీసుకువచ్చి డోర్నకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధించడంలో కీలకభూమిక పోషించిన ఆర్.సురేందర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ... త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో సైతం పార్టీ శ్రేణులు కలిసికట్టుగా ఉండి పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని సూచించినట్లు సుమీర్‌చంద్‌జైన్, మాద శ్రీనివాస్‌లు తెలిపారు.

ఘనంగా బంగారు మైసమ్మ వార్షికోత్సవం

మరిపెడ రూరల్, జనవరి 13 : మండలంలోని ఆనేపురం శివారు వెంకట్యా తండాలోని బంగారు మైసమ్మ ఆలయ వార్షికోత్సవ సందర్భంగా శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహణ కర్త, వెంకట్యాతండా సర్పంచ్ సూరనాయక్ మాట్లాడారు. శనివారం బంగారు మైసమ్మ తల్లికి కుంకుమ పూజలు నిర్వహించామన్నారు. ఆదివారం దేవాలయం ముందు జంతు బలల కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

తొర్రూరు, జనవరి 13 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు శనివారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్, జిల్లా అధ్యక్షుడు చాగంటి రమేష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం నిరంతరంగా కృషి చేస్తున్నారని, ప్రభుత్వాలు వెంటనే వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నూతన అధ్యక్షుడిగా తలారి అశోక్, ప్రధాన కార్యదర్శిగా తలారి సురేష్, అధికార ప్రతినిధిగా మహంకాళి జగన్, ఉపాధ్యక్షుడిగా ఏకస్వామిలను ఎంపిక చేశామన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమారపు ఐలయ్య, వెంకన్న తదితరులు ఉన్నారు.

మరిపెడకు చేరుకున్న షిర్డీసాయి పాదయాత్ర

మరిపెడ రూరల్, జనవరి 13 : ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా రాజుపాలెంలో శాంతసాయి 100 అడుగుల ఎత్తుగల సాయి కోటి మహా స్థూపాన్ని నిర్మించారు. దీంతో ఆ గ్రామం, జిల్లా పురోభివృద్ధి కావాలనే నేపథ్యంతో రాజుపాలెం నుంచి మహారాష్ట్రలోని షిర్డీ సాయిబాబాను దర్శించుకొనేందుకు బయలుదేరిన 40 మంది సాయిభక్తులు శనివారం మరిపెడ మునిసిపాలిటీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా మరిపెడ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త దారం నాగేశ్వరరావు దంపతులు 40మంది సాయి భక్తులకు అల్పాహారం, ఫ్రూట్స్ అందజేసి, మధ్యాహ్నం సాయిబాబా దేవాలయంలో భిక్ష ఏర్పాటు చేశారు. అనంతరం సాయి భక్తులు సాయి గురు ఏ సత్యనారాయణ, సాయి రుత్విక్ ఏపీ రామారావు, ఏ వెంకటేశరరావులు మాట్లాడారు. ఈ నెల 5న రాజుపాలెంలో ప్రారంభమయ్యామన్నారు. 1200 కిలో మీటర్లు పాదయాత్రను ప్రతీ రోజు 26 కిలో మీటర్లు ప్రయాణం చేస్తామన్నారు. రాజుపాలెం నుంచి ఎల్.ఎన్. డీ రెడ్డిగూడెం, రాజానగరం నుంచి రామారావు సెంటర్ మీదుగా కామయ్యపాలెం చేరుని రాత్రికి మకాం చేశామని తెలిపారు. అక్కడ నుంచి తెలంగాణ రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా అశ్వారావుపేట, గుస్సేపల్లి, బేతిపల్లి, సత్తుపల్లి నుంచి ఖమ్మం, అక్కడ నుంచి పాతర్లపాడుకు వచ్చి విడిది చేశామన్నారు. పాతర్లపాడు నుంచి మరిపెడకు వచ్చామన్నారు. ఆనేపురం స్టేజీ వద్ద బస చేస్తామని వారు తెలిపారు. ఇప్పటి వరకు 9 రోజుల్లో 234 కిలో మీటర్లు పాదయాత్ర చేశామన్నారు.


పాదయాత్రగా వస్తున్న సాయి భక్తులు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : పాలకుర్తి ఎమ్మెల్యే

తొర్రూరు, జనవరి 13 : ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం తొర్రూరు డివిజన్‌కేంద్రంలో విశ్వకర్మ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. ఉద్యోగులు ఫ్రెండ్లీ ప్రభుత్వానికి సహకారం అందిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామని తెలిపారు. నాయకులు చెన్నోజు విజయ్ కుమార్, కె.సుధాకరాచారి, వెంకటాచారి, వీరభద్రాచారి, కృష్ణారావు, శ్రీనివాస్, సురేష్, శంకర్, విక్రమ్ పాల్గొన్నారు.